


# సాధు జీవి

## నల్లూరి ఇందిర

ణమై, ప్రముఖుల జాబితాలో చేరేవాడని అతని భజనపరుల నమ్మిక.

అయినా ఇప్పటికీ మునిగిపోయిందేమీ లేదంటాడు సుమంతరావు. ప్రపంచంలో ప్రఖ్యాత వ్యక్తులుగా గుర్తించబడిన వారెవరూ బ్రహ్మచారులు కారని, నిజానికి గాంధీ, మార్క్స్, బుద్ధుడు వంటివారంతా పెళ్ళాడారు కనుకనే అంతోటి సత్కార్యాలు చేయగలిగారని చెప్పేవాడు. భారత దేశ పల్లెసీమలను పారిశ్రామిక కేంద్రాలుగా మార్చగల ప్రణాళిక తనవద్ద వుందని, సత్వరం దాన్ని అమలుచేసి దేశంలో నిరుద్యోగ సమస్యను నామరూపాలు లేకుండా చేస్తానని అతి నిగ్రహంగా, విశ్వసనీయంగా ప్రకటించేవాడు.

ఒకరోజు—

పురిటికోసం పుట్టింటికెళ్ళిన భార్య లక్ష్మి తిరిగి రాగానే తన దేశోద్ధరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని, అందుకై అందరూ సంసిద్ధంగా వుండండని శిష్యులను హెచ్చరించాడు. ఆనాటినుంచి ఆ శుభ ఘడియల కోసం అందరూ ఉద్వేగభరితంగా ఎదురుచూడసాగారు.

సుమంతరావుకు కుమారుడు పుట్టాడు. బిడ్డకు ఆరోనెల వస్తేగాని కాపురానికి పంపేది లేదంటే, ఆమేరకు తన కార్యక్రమాన్ని వాయిదావేశాడు సుమంతరావు. ప్రస్తుతం కొడుకు రెండేళ్ళవాడయ్యాడు. కానీ భార్య మాత్రం కాపురానికి రాలేదు. తండ్రి లేకుండా, తాతగారే బిడ్డకు అన్నప్రాసన, ఉపనయనం జరిపించేసినా సుమంతరావు ఏమీ మాట్లాడలేదు. తన పరిస్థితిని అర్థంచేసుకుని వెంటనే లక్ష్మిని కాపురానికి పంపమని మాత్రం పరిపరి విధాలుగా అర్థించాడు. కానీ అతడి మాటను ఏ ఒక్కరూ పట్టించుకోలేదు.

అయినా అతడు చాలా నిగ్రహంగా వ్యవహరించాడు. రమ్మని ఉత్తరాలు రాశాడు. తన భవిష్య కార్యక్రమమంతా ఆమె రాకపైవే ఆధారపడి వుందని, ఆమె సహకారం లేకుండా ఒక్క పనీ ముందుకు సాగదని, వెంటనే బయలుదేరమని రాసేడు.

గాంధీ, నెహ్రూ, సోక్రటీసు, మార్క్స్ ఇలా అందరి భార్యలు తమ తమ భర్తల కెంతగానో సహకరించారు కనుకనే వారంతటి గొప్పవారుగా ఖ్యాతినొందారని, ఆ మహాతల్లుల సరసన నిలబడే అదృష్టం తనద్వారా ఆమెకు లభిస్తొందని, భవిష్యత్తులో ఆమెను అందరూ ఆదర్శ మహిళగా కొనియాడతారని చిలవలు పలవలుగా వివరించారు.

అయితే అతని మాట ఒక్కటీ బుర్రలోకి ఎక్కినట్టుగా ఆమె ప్రవర్తించలేదు. కావురానికీ రాలేదు. సుమంతరావుకు ఏం చేయడానికీ పాలుపోలేదు.

భార్య కాపరానికి రాకపోవడం వెనుక కారణం ఏమయివుంటుందా! అని తల బద్దలు కొట్టుకున్నాడు సుమంతరావు. డబ్బులు తగలేసి కొంత కాలం గూఢచర్యం కూడా నడిపాడు. తన్ను పోలిన కొడుకే పుట్టకపోయుంటే తన మగతనాన్ని అనుమానించవచ్చు. అయితే ప్రస్తుతం

> "ఏడకింటిని.... జయించిన వాడు మాత్రమే విశ్వవిజేత కాగలడన్న ఇంగ్లీషు సామె తను అతడు పలుమార్లు స్మరించి నిట్టూర్చాడు. స్త్రీ సుఖం లేకుండా తాను ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేనని, ప్రతి మగవాడి విజయం వెనుక ఆడది వుంటుందనే విశ్వవ్యాపిత నిగూఢ సత్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నట్టు ప్రకటించాడు"

తనలాటి సినలయిన మగాడిని కాదనే ఆడదాని మనసేమయి వుంటుందా? అని పలువిధాలా ఆరాలుతీశాడు.

చివరికోరోజు "ఇంతకాలం వెర్రిబాగుల భర్తతో ఎలాగో కావురం చేశాను. కానీ, అతని నీడలోనే కన్న బిడ్డను కూడా వెంగళప్పను చేయలేను. ఇక నాకూ నా భర్తకూ ఏ సంబంధమూ వుండబోదు" అని తన భార్య సన్నిహితులతో చెప్తకుంటోందని విని పరమానంద భరితుడయ్యాడు సుమంతరావు.

చరిత్రలో గొప్పవారందరూ మొదట పిచ్చివారిగానే గుర్తింపబడ్డారని, తన భార్య కూడా తనను అలాగే భ్రమించిందని చెప్పాడు. తన జీవితాదర్శాన్ని అర్థంచేసుకోగలదనే నమ్మకంతో చదువుకున్న అమ్మాయిని పెళ్ళాడానని, అయితే చదువులు మూర్ఖత్వాన్ని పోగట్టవనేందుకు తన భార్యే రుజువని చిరాకుపడ్డాడు. ఒక తెలివిలేని ఆడదానికోసం రెండేళ్ళ సమయం వ్యర్థమయినా ఆమె అసలు రూపం తెలుసుకున్నందుకు సంతోషపడ్డాడు. కావురానికి రానని మొండికెత్తే భార్య తనకూ అవసరం లేదని, ఆమె దగ్గరికి ఇక వెళ్ళేది లేదని తెగేసి చెప్పి శాశ్వతంగా భార్యకు దూరమయ్యాడు.

ప్రస్తుతం సుమంతరావుకు రోజులు నిర్భాగ్యంగా, నిరాసక్తంగా గడుస్తున్నాయి. భార్యకంటే, లక్ష్యం ముఖ్యమని బింకంగా మాట్లాడి తెగతెంపులు చేసుకున్నాడే కాని, ఆమెతో గడిపిన సుఖరాత్రులు అతడిని వేధిస్తూనే వున్నాయి. ముఖ్యంగా పడకటింట్లో కలిగే అనిర్వచనీయమైన ఆనందానుభూతి, తద్వారా కలిగే ఆత్మవిశ్వాసము, ఉత్సాహము, ఏదయినా చేసేయగలిగే సాహసము అతనికి జ్ఞాపకమొచ్చాయి. పడకటింటిని జయించినవాడు మాత్రమే విశ్వవిజేత కాగలడన్న ఇంగ్లీషు సామెతను అతడు పలుమార్లు స్మరించి నిట్టూర్చాడు. స్త్రీ సుఖం లేకుండా తాను ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేనని, ప్రతి మగవాడి విజయం వెనుక ఆడది వుంటుందనే విశ్వవ్యాపిత నిగూఢ సత్యాన్ని అనుభవపూరకంగా తెలుసుకున్నట్టు ప్రకటించాడు.

అందుకే సుమంతరావు మళ్ళీ పెళ్ళాడాలనే నిర్ణయం చేసుకున్నాడు.

* * *

సుమంతరావు రెండో పెళ్ళి నిర్ణయమయినాక అతడి మనసులో తొలిగా మెదిలిన అమ్మాయి జానకి. సుమారు ముప్పయ్యేళ్ల వయసున్న జానకి, సుమంతరావుకు గత పది సంవత్సరాలుగా తెలుసు. నిత్యం చిరునవ్వుతో చలాకీగా, ఏదో ఒక పనిచేస్తూ కనిపించే జానకికి ఇంకా పెళ్ళెందుకు కాలేదా! అని సానుభూతిగా అనుకునేవాడు సుమంతరావు. నలుగురూ అనడం ఏమంటే ఆమెకు మగ స్నేహాలు వున్నాయని, సంఘసేవ పేరుతో నిరంతరం ఆమె వారితో తిరుగుతుంటుందని, నమ్మదగిన శీలం కాదని, అయినప్పటికీ సంఘసేవా పరురాలయిన జానకి మరింత విశాలమైన తన స్వదేశీ ఉద్ధరణను అర్థంచేసుకుని ప్రోత్సహించగలదనుకున్నాడు. అంతేకాదు, జానకిలాంటి నిందాగ్రస్తురాలిని వివాహం చేసుకోవడం కూడా ఆదర్శప్రాయమైన స్త్రీ జనోద్ధరణే కనుక దయతో ఆమెను తన జీవితంలోకి ఆహ్వానించడానికే నిర్ణయించుకున్నాడు. ఇలా జీవిత లక్ష్యం కోసం తాను కులభ్రష్టుడయినా ఫరవాలేదనుకున్నాడు.

ఒక శుభోదయాన సుమంతరావు, జానకితో–

"జానకీ! నేను మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నా"నన్నాడు.

"అదేంటి? మీ భార్య వుండగానే" అంది జానకి.

"పురిటికని వెళ్ళినది రెండేళ్ళయినా రాలేదు. ఇక రానని కూడా చెప్పింది. వేరు మార్గమేముంది?"

"ఎందుకలా జరిగింది?"

"మూర్ఖత్వం. తెలివిలేని తనం. నీకు తెలుసుగా, దేశానికి సేవ చేయాలన్న నా ఆదర్శం. దానికి చెప్తే అర్థంకాదు. నాకు నా లక్ష్యమే ప్రధానం" అన్నాడు.

"పోనీ. మీ కార్యక్రమాలను మొదలుపెట్టకపోయారా. చాలా విషయాలు చెప్పడం కంటే చేస్తేనే అర్థమవుతాయి" అంది జానకి సానుభూతిగా.

"ఇదిగో, ఇప్పుడో అప్పుడో మొదలుపెడతానంటుండగానే అది వెళ్ళి అక్కడ కూర్చుంది. జానకీ! నాది చాలా బృహత్తరమైన, కష్టసాధ్యమైన ప్రణాళిక. ఒక ఆత్మీయమైన తోడు లేకుండా మొదలుపెట్టడం అసాధ్యం" అన్నాడు సుమంతరావు.

"అయితే పెళ్ళికూతుర్ని చూడాలనమాట" అంది జానకి నవ్వుతూ.

"అది మాట్లాడేందుకే వచ్చాను. ఎవరినో ఎందుకు. సమాజం పట్ల, దేశం పట్ల సేవాదృక్పథం కలదానివి నీకంటే నన్ను ఎవరు అర్థం చేసుకోగలరు. అందుకే నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నా" అన్నాడు సుమంతరావు గంభీరంగా.

"నా ప్రమేయం లేకుండానే పెళ్ళి నిర్ణయించేశారా?" అంది జానకి అర్థంకాని ఆశ్చర్యంతో.

"అదెలా కుదురుతుంది? అందుకేగా నిన్ను అడుగుతున్నా"

"మీరు అడగడంలేదు. నిర్ణయాన్ని తెలియజేస్తున్నారు."

"తేడా ఏముంది జానకి. ఈ పెళ్ళిని నీవయినా ఎందుకు కాదంటావు. మనిషన్నాక పెళ్ళి అవసరమే కదా! నీకూ వయసు మీదపడుతోంది" అన్నాడు సుమంతరావు.

"అక్కడే మీరు పొరపడ్డారు. పెళ్ళి అవసరమని నేననుకోవడంలేదు" అంది.

"అంటే నీవసలు పెళ్ళే చేసుకోవా?" అవాక్కయిపోయాడు సుమంతరావు.

"చేసుకోను"

"నీకసలు కోరికలే వుండవా?"

"ఉండవు."

"నేన్నమ్మను."

"మీ నమ్మకంతో నాకేం పని?"

"కనీసం జీవితానికో తోడుండాలని లేదా?" దీనంగా అన్నాడు.

"తోడు లేకపోతే చేయలేని పనులేవీ లేవు నాకు" అంది జానకి.

"నేను ససేమిరా ఒప్పుకోను. మనిషన్నాక వయ

సుకు తగిన సహజ శారీరక వాంఛలు, కోర్కెలు వుండితీరతాయి".

"ఉంటే వుంటాయి. ఇప్పుడు మన చర్చ అది కాదు కదా!"

"నిజమే. కానీ పెళ్ళి కాకుండా సహజ వాంఛలు తీరేదెలా?" అన్నాడు.

"ఎలాగోలా తీరతాయి. ఇతరులను గురించి మీకెందుకు బాధ"

"అంటే అడ్డదారిలో పశువుల్లా కోర్కెలు తీర్చుకోవడమేనా" అన్నాడు సుమంతరావు ఉక్రోషంగా.

"అది మీకు సంబంధించిన విషయం కాదు కదా!"

"అంటే నీవూ అలాగే అడ్డదారిలో నీ కామాన్ని చల్లార్చుకుంటున్నావా?" సుమంతరావు ముఖం జేవురించింది.

"సుమంతరావుగారు! నాకు కామమున్నా, తోడు కావాలని వున్నా మిమ్మల్ని మాత్రం పెళ్ళిచేసుకోను. సరేనా ఇక ఎక్కువగా మాట్లాడకండి" అంది జానకి కఠినంగా.

సుమంతరావు కూడా కాస్త తగ్గి "అవున్లే బజారులో పాలే దొరుకుతుంటే, ఆవుని మేపడమెందుకు" అన్నాడు వ్యంగ్యంగా.

"అంటే" అంది జానకి అర్థంకానట్టు.

"ఏం లేదు. నామటుకు నాకు వివాహేతర లైంగిక సంబంధాలు ఇష్టంలేదు" అన్నాడు.

"అయితే లక్షణంగా పెళ్ళిచేసుకోండి" అంది జానకి. 'ఇక వెళ్ళిరండి' అన్నట్టు విసురుగా వమస్కారం పెట్టి.

వాతావరణంలో వేడిని గ్రహించిన వాడిలా దిగ్గున లేచి, బయటపడ్డాడు సుమంతరావు.

జానకి తనను పెళ్ళాడనని అలా తెగేసి చెప్పడం అతడు కలలో కూడా ఊహించలేదు. తనను కాదనడానికి సరయిన కారణం తెలీక అతడు అయోమయంలో పడిపోవడం వాస్తవమే. అయినా అసలు ఆ అమ్మాయికి తన పెళ్ళికాని స్థితిపట్ల ఎలాంటి ఆందోళనా, విషాదమూ లేకపోవడం అతనికి అంతుపట్టని విషయమయింది. అదీకాక, ఎవరి కోరికలు వారెలాగయినా తీర్చుకుంటారని, అందుకు ఎవరికీ ఎలాంటి సంజాయిషీ ఇవ్వవలసిన పని లేదని ఆమె అన్నమాటలు అతడిని ఆందోళనకు గురిచేశాయి. హిందూ స్త్రీ, మన సంస్కృతి సంప్రదాయాలకు దూరంగా ఎటో కొట్టుకుపోతున్నది. ఆమెకు సన్మార్గాన్ని చూపవలసిన బాధ్యత కూడా తనకు అదనంగా వుందని అనుకున్నాడు.

* * *

సుమంతరావుది ద్వితీయ వివాహమే అయినా కాళ్ళు కడిగి కన్యాదానం చేసేవారు కోకొల్లలు. అయితే సమీప భవిష్యత్తులో ప్రముఖ వ్యక్తుల జాబితాలో చేరే సుమంతరావుకు కేవలం భార్య అవసరం లేదు. అతడి లక్ష్యసాధనలో ఉత్తేజ రకంగా పనిచేసే జానకిలాంటి భార్య కావాలి. లేదా అతని అడుగుజాడలలో భక్తితో నడవగలిగే అమ్మాయి అయినా కావాలి.

కార్యేషు దాసి, కరణేషు మంత్రి. శయనేషు రంభ కాగల అమ్మాయి ఒకతె తన వీధిలోనే వున్నట్టు గుర్తించాడు సుమంతరావు. పేరు అరుంధతి. వివాహిత. అయితే ప్రస్తుతం భర్త నుంచి విడిపోయి బతుకుతోంది. అలాగని ఆమె బరితెగించింది కాదు. సుమారు రెండేళ్ళు భర్త పంచన వుండి, సర్వహింసలు భరించిన పతివ్రత. ఏ క్షణాన్నయినా చనిపోయే స్థితిలో వున్న అరుంధతిని గుర్తించి, ఇరుగు పొరుగువారు పోలీసుల ప్రమేయంతో ఆమెకు భర్తనుంచి విడాకులు ఇప్పించారు. అలాంటి స్థితిలో భర్తను వదలడం సమంజసమే అనుకున్నాడు సుమంతరావు. తానయితే కచ్చితంగా అలా హింసించనని కూడా అనుకున్నాడు.

తన లక్ష్యసాధనకై విధవనో, వివాహితనో చేపట్టడం తప్పకాదని అనునయించుకుని, పుట్టింటి ఆదరణ లేక ఒంటరితనాన్ని ఈడుస్తున్న అరుంధతికి తాను ఒక దారి చూపాలని నిర్ణయించుకున్నాడు.

ఒకనాటి మిట్టమధ్యాహ్నవేళ అరుంధతిని రోడ్డు మీద అటకాయించి "నేను నిన్ను పెళ్ళి చేసుకుంటా. రాత్రి భోజనానికి కబురుపెట్టు. వచ్చి మాట్లాడతా" అని వడివడిగా కనుమరుగయ్యాడు సుమంతరావు.

నిర్భాగ్య యువతికి తాను నూతన జీవితాన్ని ప్రసాదిస్తున్నందుకు ఎంతో మురిసిపోయాడు. ఆమె తనపట్ల కృతజ్ఞతగా వుంటుందని, తన లక్ష్యసా


బరువైనవి, పొదుచుకొచ్చేవి, పెళుసైనవి...



పెల్ మెట్ ల యుగం ముగిసింది

చెక్క పెల్ మెట్ లతో చిక్కులు

- తయారు చెయ్యడానికి, అమర్చడానికి, రిపేరు చెయ్యడానికి, పాలిష్ చెయ్యడానికి కార్పెంటర్లు కావాలి.
- నల్లులు, బల్లులు, బొద్దింకలు, చెదలకు ఆశ్రయమిస్తాయి.
- దుమ్ము పేరుకుంటుంది, బూజు పట్టుంది.
- తరచుగా సంరక్షణ అవసరం.

నునుపైనవి, సొగసైనవి, మన్నికైనవి...



Decorail®

శకం మొదలైంది

డెకోరైల్ తో సౌకర్యాలు

- త్వరగా, సులభంగా అమర్చుకోవచ్చు.
- మీరే అమర్చుకోవచ్చు. కార్పెంటర్లు అక్కర్లేదు.
- టెలిస్కోపిక్ రైలు కారణంగా ఏ సైజు కిటికీలు/తలుపుల పైనైనా అమర్చుకునే సౌకర్యం.
- చాలా కాలం మన్నే, పౌడర్ కోటెడ్ లోహం మరియు ప్లాస్టిక్ భాగాలు.
- ప్రత్యేకంగా తయారు చేయబడిన కర్టెన్ టేపు, హుక్స్ కారణంగా ట్రిపుల్ ప్లీట్స్ వస్తాయి, శుభ్రం చేయడానికి, ఇస్త్రీ చేయడానికి సౌకర్యంగా ఉంటుంది.

SAVE WOODS · SAVE EARTH

AJAY WINDECOR PRODUCTS PVT. LTD.
Gurudeep-2, Tulshibaugwale Colony,
Sahakar Nagar No. 2, Pune - 411 009. (INDIA)
Tel.: (0212) 434483 Fax: (0212) 477838

Anantapur, Ph: 21893; Bangalore, Ph: 6628054; Belgaum, Ph:24035; Bijapur, Ph: 22780; Calicut, Ph: 64323; Cherthala, Ph: 813545; Coimbatore, Ph: 443354; Ernakulam, Ph: 367012; Gadag, Ph: 28212; Hubli, Ph: 65573; Hyderabad, Ph: 201375; Kannur, Ph:63370; Karkala, Ph: 6967; Kozhen Cheri, Ph: 2865; Madras, Ph: 517913; Mangalore, Ph: 457470; Moodabidri, Ph: 647; Panaji, Ph: 224676; Rajahmundry, Ph: 72118; Shinoga, Ph: 21401/2; Thiruvanthapuram, Ph: 436453; Thrissur, Ph: 26089; Vijayawada, Ph: 424092/421396. Dealer Enquiry Solicited

"ఒంటరి ఆడదానికి సహాయం చేస్తే నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటారు. మన గురించలా మాట్లాడుకోవడం నాకిష్టం లేదు. పద్ధతిగా పెళ్ళి చేసుకుందాం. నీ కిష్టమయిన ప్పుడే కాపురం చేద్దాం" అన్నాడు.

ధనలో వెన్నంటి ప్రోత్సహించే స్త్రీమూర్తి అరుంధతే అని అతనికి అర్థమయింది. అందుకే ఆమె పిలుపుకై అతడు ఉద్వేగంగా ఎదురుచూశాడు.

రోజులు గడుస్తున్నాయి. కానీ ఆమెనుంచి ఎలాంటి సూచనా అందలేదు. బహుశా సిగ్గు పడుతోందని గ్రహించి ఒకరోజు తనే అరుంధతి ఇంటికి వెళ్ళాడు.

"........"

"క్షమించండి. నాకు వైవాహిక జీవితం పట్ల వ్యామోహం లేదు" అంది అరుంధతి తలుపుచాటునుంచి.

"అలాగని ఎంతకాలమిలా ఒంటరి జీవితం గడుపుతావు?"

"ప్రస్తుతం ఈ ఒంటరితనమే సుఖంగా వుంది"

"అరుంధతీ! అందరూ నీ భర్తలాగే ఎందుకుంటారు. ఇన్నేళ్ళుగా నన్ను చూస్తున్నావు. నేనెన్నడయినా భార్యను కొట్టానా? అంతెందుకు దాన్ని పల్లెత్తు మాటయినా అన్నానా?"

"నిజమే. మీరు మంచివారు. కానీ నాకలా జరగలేదు. ఆ రోజులు తల్చుకుంటేనే భయమేస్తుంది" అంది అరుంధతి.

"పాత జీవితాన్ని తల్చుకుంటూ రానున్న కొత్త, ఆనందకరమైన జీవితాన్ని కాదంటావా? చెప్పు" అన్నాడు అనునయంగా.

"మీరు నా మంచే చెప్తున్నారు. కానీ నేను సంసారానికి పనికిరాను. మీకు నావల్ల ఏ సుఖమూ వుండదు. మగవారు కోరుకునే స్పందనలన్నీ నాలో అడుగంటిపోయాయి. మీరు మరెవరినయినా వివాహం చేసుకోండి" అంది అరుంధతి అభ్యర్థనగా.

"నీవు పొరబడుతున్నావు. శరీర వాంఛలకోసం నిన్ను కోరుకోవడం లేదు. దేశానికి నావల్ల కావలసిన పనులెన్నో వున్నాయి. పనితో అలసిపోయిన నేను సేద దీరడానికి ఒక ఒడి కావాలి. నిన్ను తల్లిగా, సలహాదారుగా, భార్యగా, స్నేహితురాలిగా నా జీవితంలోకి ఆహ్వానిస్తున్నాను" అన్నాడు సుమంతరావు.

"మీకలాంటి ఉద్దేశం లేకపోతే పెళ్ళే అవసరం లేదు కదా! మీరు చేయబోయే పనిలో నావల్ల జరిగే సహాయం ఏదయినా వుంటే సంతోషంగా చేస్తాను. దేశానికి నావంతు సేవ చేయడం నాకు ఆనందమే" అంది అరుంధతి.

"అలా ఎలా వీలవుతుంది?" అన్నాడు సుమంతరావు నామనస్తూ.

"ఎందుకని వీలు కాదు?"

"ఒంటరి ఆడదానికి సహాయం చేస్తే నలుగురు నాలుగు రకాలుగా అనుకుంటారు. మనగురించలా మాట్లాడుకోవడం నాకిష్టంలేదు. పద్ధతిగా పెళ్ళి చేసుకుందాం. నీకిష్టమయినప్పుడే కాపురం చేద్దాం" అన్నాడు.

"క్షమించండి. పాత గాయాలు యింకా మాను పట్టలేదు. తిరిగి ఆ పెళ్ళి వూబిలోకి దిగలేను" అంది అరుంధతి స్థిరంగా.

"పెళ్ళంటే కేవలం సెక్సే అనుకుంటున్నావా? కాదు. మన పెళ్ళి అందుకు కాదు. నా ఆశయ సాధనలో నిన్ను సహకరించమంటున్నాను. స్త్రీగా, భార్యగా నీ జీవితానికి అర్థాన్ని, పరమార్థాన్ని చూపడానికి ప్రయత్నిస్తున్నాను. అర్థం చేసుకో" అన్నాడు సుమంతరావు అసహనంగా.

"సెక్స్ అవసరం లేదంటే, మీరు మగవారి సహకారాన్నే పొందవచ్చు కదా! వారికి మీరు సహాయం చేస్తే ఎవరూ ఏమీ అనరు కూడా." అంది అరుంధతి కాస్త వెటకారంగా.

"అది ప్రధానం కాదన్నాను కానీ, అవసరం లేదని చెప్పానా? కొంతకాలం పోతే నీవూ మారకపోవు కదా!" అన్నాడు సుమంతరావు నవ్వుతూ.

నవ్వుతున్న సుమంతరావుని మొదటిసారి విచిత్రంగా చూసింది అరుంధతి. దేశసేవ, ఆదర్శాలు, పరమార్థాలు వంటివి తనకు కొత్త విషయాలని, ఆ వ్యవహారాలు తనకు అర్థంకావు కనుక మరెవరినన్నా వివాహం చేసుకోమని కచ్చితంగా చెప్పి, అతికష్టంమీద సుమంతరావుని పంపించగలిగింది అరుంధతి.

కలలో నడిచినట్టుగా నడుస్తూ బయటపడ్డాడు సుమంతరావు. మొగుడొదిలేసినది కూడా తనను కాదనడం, అతడు ఎదురుచూడని పరిణామమే. ఆడవారు తననెందుకు కాదంటున్నారో అతడికి అర్థంకాలేదు.

అందుకే ఈసారి మరే ప్రయత్నమూ లేకుండా, మరోసారి సంప్రదాయానుసారమే వివాహం చేసుకోవాలనుకున్నాడు.

* * *

సావిత్రి పదహారేళ్ళ పడుచుది. తల్లిలేని బిడ్డను తొందరగా ఒక అయ్య చేతిలో పెట్టి, దేశాటన చేయాలని వుబలాటపడే పేద తండ్రి ముద్దు బిడ్డ.

రెండవ పెళ్ళివాడయితేనేమి సలక్షణంగా వుంటాడు. వయసు కొంచెం ఎక్కువయినా, మంచివాడయిన సుమంతరావుని వరించేందుకు మనస్ఫూర్తిగా ఇష్టపడింది సావిత్రి. అయినా పైసా కట్నాన్ని ఆశించకుండా, ఇచ్చింది పుచ్చుకునే అల్లుడు దొరకడం కంటే ఆనందం మరేముంటుంది ఆడపిల్ల తండ్రికి. ముహూర్తం నిర్ణయించి పెళ్ళి పనులలో మునిగిపోయాడామె తండ్రి.

ఒకరోజు కాబోయే భార్యతో భవిష్యత్తును గురించి ఏకాంతంగా మాట్లాడాలన్నాడు సుమంతరావు. అల్లుడి మాట నెవరయినా కాదనగలరా? కూతురితో ఏకాంతాన్ని సమకూర్చాడా తండ్రి.

సుమంతరావు తన జీవితాదర్శాన్ని ఉత్తేజభరితంగా వివరిస్తూ వుంటే మనోహరంగా వింది సావిత్రి. సమర్థుడు, కాబోయే గొప్పవాడు అయిన వ్యక్తి భర్తగా దొరకడం తన అదృష్టంగా భావించి సమ్మోహనంగా చూసిందామె.

సావిత్రి మోహపు చూపులకు చలించిన సుమంతరావు ఆమెను మృదువుగా దగ్గరకు తీసుకుని నుదుటిని చుంబించాడు. ఆమె సిగ్గుపడి అతడి ఛాతీపై వాలిపోయింది. సుమంతరావు ఆమెను గాఢంగా కౌగలించుకుని ముద్దులతో ముంచెత్తాడు.

అతడి వేగానికి ఆమె బెదిరిన లేడిపిల్లలా విదిలించుకుని దూరంగా జరిగింది. అయితే అతడామె

భయాన్ని గుర్తించే స్థితిలో లేదు. తమకంగా ఆమెను తిరిగి ఆక్రమించుకుని తటిభాగాన్ని గట్టిగా తొడలకు అదుముకున్నాడు. విసురుగా ఆమె పవిట తొలగించి ఉద్వేగంగా రవికమీద ముద్దులు పెట్టసాగాడు.

సావిత్రి పిల్లికూనలా కిచకిచమని అరుస్తూనే వుంది. కాంక్షాకీలలతో దహించుకుపోతున్న సుమంతరావు చేతులు ఆమె శరీరమంతా పాకాయి. జరుగుతున్నదేంటో గ్రహించిన సావిత్రి అతడి పట్టును విడిపించుకోలేక కెవ్వున కేక వేయడంతో తిరిగి ఈ లోకంలోకి వచ్చి ఆమెను వదిలేశాడు సుమంతరావు. భోరుభోరున ఏడుస్తూ గదిలోనుంచి పారిపోతున్న సావిత్రిని ఆయోమయంగా చూశాడు.

క్షణం క్రితం ఎంతో మనోహరంగా వున్న సావిత్రి తనను విదిలించుకు వెళ్ళిన తీరు అతడిని గాయపరచింది. అయితే పెళ్ళయేంతవరకు ఏమీ మాట్లాడకూడదని అనుకున్నాడు.

అయితే ఈ సంఘటన జరిగిన రెండ్రోజులకు కారణమేంటో తెలీదుగానీ సావిత్రి ఈ పెళ్ళికి సుముఖంగా లేదని ఆమె తండ్రి చేతులు నలువుకుంటూ చెప్పిపోయాడు. బిడ్డ ఇష్టానికి భిన్నంగా తానేమీ చేయలేనని, క్షమించమని అర్థించాడు కూడా.

సుమంతరావు హతాశుడయ్యాడు.

* * *

ఒకనాటి సాయంత్రం చింతాగ్రస్తుడైన సుమంతరావు తనకు మిగిలిన ఒకరిద్దరు తలమాసిన అనుచరులతో తృటిలో తప్పిపోయిన పెళ్ళిని గురించి బాధను వ్యక్తంచేశాడు. అతగాడి దేశీయ వేదనను, స్త్రీ మనోశోధనను ఎరిగిన శిష్య పరమాణువు ఒకడు–

"అయ్యా! తమరు ఏకాంతంలో చేసిన ఒకానొక చిలిపి పనివల్లే ఆమె పెళ్ళి వద్దన్నదనుకుంటే, వివాహానంతరం అయినా ఆమె మిమ్మల్ని పరిత్యజించగల అవకాశం వున్నదని రూఢి అవుతోంది" అన్నాడు.

సుమంతరావు నిర్లిప్తంగా నవ్వాడు.

దాంతో శిష్యుడు తిరిగి "అయ్యా! యోచించి చూస్తే, కసాయి అంగడిలో మాంసపు ముద్దకు, స్త్రీ శరీరానికీ అట్టే తేడా అగుపించడంలేదు. తమరు ఆగ్రహించకపోతే ఒక్క మాట. ఇంతకీ శరీర సేవ ముఖ్యమా? దేశ సేవ ముఖ్యమా?" అని వేదాంతంగా ప్రశ్నించాడు.

సుమంతరావు క్షణకాలం కంపించిపోయాడు.

ఆ ప్రశ్నకు సమాధానం మీకేమన్నా తెలిస్తే సుమంతరావుకు చెప్పండి.

జ్ఞానులమ కాపాడుకోవడం మన ధర్మం! ◆



జీతం

"గొప్పింటినుంచి వచ్చావు. మరి నువ్వు గనుక నన్ను పెళ్లాడితే నా జీతం మీద బతకగలవా" అడిగాడు శ్రీనివాస్

"బతకగలను గాని మరి నువ్వప్పుడు ఎవరి జీతం మీద బతుకుతావు" అంది కమల.

–వి.వి.మురళీకృష్ణ,
హైదరాబాద్.




కెశవర్ధిని...

పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం

పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె.
అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన
శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.

కొద్ది చుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగలాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈ రోజునే కేశవర్ధిని కొనండి.

ఆరునెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.




కేశవర్ధిని
తలనూనె

కేశవర్ధిని ప్రోడక్ట్స్ మద్రాసు-600 087